క్లుప్తంగా

కనుల పండువగా రథోత్సవం


మదన్‌పల్లిలో స్వామివారి రథోత్సవం

అనంతగిరి: వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామ పరిధిలోని సంగయ్యలొంక శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. గ్రామం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం భజనలతో, ఆటపాటలతో ఆలయం వరకు సాగింది. రథంపై స్వామి వారిని తీసుకరావడంతో గ్రామస్తులు కొబ్బరికాయలు, మంగళహారతి ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ ఉత్సవంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భక్తులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరులో రెండు రోజులుగా నాగ ప్రతిష్ఠాపన బొడ్రాయి, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ జోరుగా సాగుతున్నాయి. శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమం ఊరంతా హోరెత్తించింది. సన్నాయి మేళాలతో ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవత ఆహ్వానం, అభిషేకం, హోమం, జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వీధినాటక ప్రదర్శన అభినందనీయం

సేవాలాల్ ఆలయ కమిటీ నేతలు


ఆంజనేయస్వామి దేవాలయంలో బోగ్ నిర్వహిస్తున్న బంజార సంఘం నాయకులు

కుల్కచర్ల: దీప్లానాయక్ తండాలో సోమవారం నుంచి శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జీవితచరిత్రను వీధినాటకంగా ప్రదర్శించడం అభినందనీయమని సేవాలాల్ ఆలయ కమిటీ నేతలు పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండలం దీప్లానాయక్ తండాలోని ఆంజనేయస్వామి దేవాలయంలో బోగ్ నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీప్లానాయక్ తండాలో ప్రదర్శించనున్న వీధినాటకం వీక్షించేందుకు బంజార ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విఠల్ నాయక్, శంకర్ నాయక్, రమేష్, హరిచందర్, రాములు, రవి, బగ్నానాయక్, టోప్యా, జాన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూభారతి సదస్సులు

ధారూరు: మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు శనివారం తహసీల్దార్ సాజిదాబేగం పేర్కొన్నారు. జిల్లాలో ధారూరు మండలాన్ని భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద కలెక్టర్ ఎంపిక చేశారని ఆమె తెలిపారు. వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర నోడల్ అధికారిగా కొనసాగనున్నారని తెలిపారు. సోమవారం అవుసుపల్లి, బాచారం గ్రామాల్లో ఈ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ధారూరు, కోట్‌పల్లి తహసీల్దార్లు రెండు బృందాలుగా సదస్సులు నిర్వహిస్తారని ఆమె వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సాజిదా బేగం సూచించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

కేశంపేట: కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ విమర్శించారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన మండల కేంద్రంలోని మానవ వనరుల భవనంలో సీఆర్పీ రామకృష్ణకు శనివారం సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మికులు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొట్టం కట్టుకో..

- ఉపాధిహామీ నిధులతో పశుపోషకులకు తోడ్పాటు
- జాబ్ కార్డులు ఉన్నవారికి సదావకాశం


పశువుల షెడ్డు

దౌల్తాబాద్: పాడిపశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెలు షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అదే విధంగా పశువులు, జీవాల పోషణకు పచ్చగడ్డి పెంపకం, నీటితొట్ల నిర్మాణాలకు ఆర్థికంగా చేయూత అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్న వారిని అర్హులుగా గుర్తిస్తున్నారు.

యూనిట్ విలువ ఇలా..

పశువుల కొట్టాల నిర్మాణానికి రూ.85వేలు చొప్పున మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. వేసవిలో జీవాల దాహం తీర్చేందుకుగాను నీటితొట్ల నిర్మాణానికినిధులు కేటాయించనున్నారు. జీవాల సంఖ్య ఆధారంగా నీటి తొట్ల నిర్మాణానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు మంజూరు చేసేలా ప్రణాళికలు రూపొందించారు.

దరఖాస్తు విధానం

పశువుల కొట్టాలు, గొర్రెల, మేకల షెడ్ల నిర్మాణానికి ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ తీర్మాణం అవసరం. అనంతరం జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారి నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకందారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దారు నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని మండలపరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఉపాధిహామీ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులు మంజూరు చేస్తారు. మండలంలో ఇప్పటి వరకు 40 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అవగాహన అవసరం

గ్రామాల్లో పశువుల కొట్టాల కోసం ఉన్న అవకాశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. అర్హులైన వారు నిర్మాణం చేసుకునేలా ప్రోత్సాహం అందించాలి. ఉపాధి హామీ ద్వారా ఉన్న బిల్లులను త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పశువుల కొట్టాలు. గొర్రెలు, మేకలు షెడ్ల మంజూరులో గొల్లకురుమలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– అంజిలయ్య, ఏపీఓ, దౌల్తాబాద్

ముదిరాజ్‌లను బీసీ–ఏ లో కలపొద్దు

వడ్డెర సంఘం నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న వడ్డెర కుల సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: ముదిరాజ్‌లను బీసీ–ఏ లో కలపొద్దని వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ–డీ లోని ముదిరాజ్‌లను బీసీ–ఏ లో కలపడం సరైంది కాదన్నారు. ప్రస్తుతం వారు 60శాతం ఉన్నారని, బీసీ ఏలోని బలహీన వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ–ఏలోకి మార్చేముందే వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ ఏలోని బలహీన వర్గాల కులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు వడ్డే భీమరాజు, దస్తప్ప, భీమ్లు, కిష్టప్ప, బసంతి, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి


అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీబీఎస్‌యూ నాయకులు

కొడంగల్ రూరల్: బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్(డీబీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలో పెద్దనందిగామలోని చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క, శివ, ఏర్పుల శంకర్, మంగలి సుధాకర్, కొత్తపేట కిష్టయ్య, రాథోడ్ గోపాల్‌నాయక్, మున్నూర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: ఏర్పుమళ్లలో చేపట్టనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ జాతీయ యూత్ కోఆర్డినేటర్ కృష్ణరాజు, వక్తలుగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, అంబేడ్కర్ ప్రజాసంఘం వ్యవస్థాపకుడు కట్టెల మల్లేశం, రమేశ్‌బాబు, సూర్యానాయక్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజయ సంకేతం చూపిస్తున్న రైజర్స్ టీమ్ సభ్యులు

దోమ: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని బొంపల్లి గ్రామ నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో బీపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీపీఎల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు టీంలు పాల్గొనగా ప్రతి రోజు రెండు టీంలు తలపడుతాయన్నారు. ఫైనల్‌లో రెండు టీంలు విజేతలుగా నిలుస్తాయని తెలిపారు. మొదటి విజేతకు రూ.10వేల బహుమతి, రెండో టీం రన్నరప్‌కు రూ.5వేల బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి టీంకు నియమ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ప్రతి టీంలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నారు. వారికి సైతం బహుమతులు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

కుల్కచర్ల: పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటానని పటేల్ చెరువుతండా మాజీ సర్పంచ్ శాంతిబాయితులసీరాం పేర్కొన్నారు. శనివారం తండా పరిధిలోని జ్యోతి వివాహానికి క్వింటాల్ సన్నబియ్యం, 15కిలోల మంచి నూనె, పెళ్లి సామగ్రి అందించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతీ ఆడబిడ్డ పెళ్లికి సుమారు రూ. 15వేల వంట సామగ్రి అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చందర్ నాయక్, ఠాగూర్ సింగ్, రవి, లక్ష్మీబాయి, రాంచందర్, సురేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

దౌల్తాబాద్: ప్రధాని నరేంద్రమోదీ జనగణనలో కులగణన నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సతీశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కులగణన దేశానికే ఆదర్శమన్నారు. మోదీ ప్రభుత్వం సమాజం, దేశహితం పట్ల నిబద్ధత చూపుతుందన్నారు. కులగణన నిర్ణయంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కుల్కచర్ల: పేదలకు అండగా ఉంటామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన గొల్ల వెంకటమ్మ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ ఆనందం, మాజీ వార్డు సభ్యులు పద్మ ఆంజనేయులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 22న నిర్వహించనున్న వీరహనుమాన్ జన్మోత్సవ శోభాయాత్రకు హిందువులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు ప్యాట వంశీ, గిరి, వీహెచ్‌పీ నాయకులు రంగయ్య, బాలబ్రహ్మాచారి, సందీప్, రిషికేశ్, దిలీప్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చెట్లవెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి


రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న సురేశ్, రాములు యాదవ్

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, సీనియర్ నాయకుడు రాములు యాదవ్

మర్పల్లి: మండల కేంద్రంలో చేపడుతున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు రోడ్డు ప్రక్కల వ్యాపారులు సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, సీనియర్ నాయకుడు రాములు యాదవ్ పేర్కొన్నారు. శనివారం కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇండియన్ గ్యాస్ గోదాం వరకు సుమారు 1,800 మీటర్ల దూరం వరకు అండర్ డ్రైనేజీ, సెంటర్ లైటింగ్ పనులకు స్థానిక ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పేదల ఇళ్లు లేదా వ్యాపార సముదాయాలకు నష్టం జరిగితే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫణి, మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రమేశ్, జిల్లా, మండల సీనియర్ నాయకుడు నాగేశ్, సలీం, అబ్రహం, జాఫర్, వినోద్ శర్మ, నర్సింలు యాదవ్, పర్వేద శ్రీనివాస్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎన్‌ఆర్ సేవలు అభినందనీయం

పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధారాసింగ్


అంతారం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో ధారాసింగ్, ఉత్తమ్‌చందులు

తాండూరు రూరల్: ఎల్ఎన్ఆర్ సేవలు అభినందనీయమని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధారాసింగ్ అన్నారు. ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు జన్మదినం సందర్భంగా శనివారం తాండూరు మండలం అంతారం సమీపంలోని తన నివాసం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ..హన్మపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టి స్వయంశక్తితో ఎదిగిన నేత నర్సిములు అని కొనియాడారు. ఉచిత కంటి ఆపరేషన్లు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఉత్తమ్‌చందు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నిరుపేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాలకు సంబంధించి 55 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, 42 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలను ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆడపిల్లలు ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు వసంతం, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, పాండు, శ్రీను, యాదయ్య, జనార్దన్, రాములు, రవీందర్‌రెడ్డి, రవి, శంకర్, నరేందర్, రాంచంద్రయ్య, తహసీల్దార్ కృష్ణయ్య, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి

బీజేవైఎం అధికారప్రతినిధి శివాజీ


అసంపూర్తిగా ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యుడితో పాటుగా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకార్ శివాజీ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం బీజేపీ నాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నిఖితతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న వైద్యుడితో పాటుగా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వారికి వివరించారు. అనంతరం ఆస్పత్రి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల నూతన భవనాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో డాక్టర్‌తో పాటుగా రేడియాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. ఏఎన్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని, సరైన సిబ్బంది లేకపోవడంతో సబ్‌సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని ఆయన ఆరోపించారు. 30 పడకల ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమై మూడు సంవత్సరాలు దాటినా నేటికీ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి, 30 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షులు రొల్లు రఘురాంగౌడ్, మున్నూరు యుగేంధర్, ఐలయ్య, రమేశ్‌గౌడ్, వినోద్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఏఓ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రభుత్వం గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. శ్రమజీవులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రభుత్వం కనీసం నెలకు రూ.18వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం నాయకులు రత్నం, యాదయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, శంకర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి


మోమిన్‌పేట: లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మహేందర్‌రెడ్డి


దోమ: చెక్కు అందజేస్తున్న పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

మోమిన్‌పేట: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మోమిన్‌పేటలో 8మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పేదలు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధిపొందొచ్చని ఆయన సూచించారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎజాస్ పటేల్, మండల ప్రధాన కార్యదర్శి సురేందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంటు సిరాజొద్దీన్, నాయకులు మహంత్ స్వామి, అప్సర్, రఘురాంరెడ్డి, ప్రేమ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గ్రామానికి చెందిన అంజిలయ్య కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.22 వేల చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..పేదలకు ప్రభుత్వం అనునిత్యం అండగా ఉంటుందన్నారు. ఆపద సమయంలో ఆదుకోవడమే కాకుండా అన్ని సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పి.రాంచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజిలయ్య, శ్రీను, వెంకటయ్య, దస్తయ్య, రామయ్య, రాములు, పాల్గొన్నారు.